# పేక మేడలు

అర్ధరాత్రి దాటుతున్నా మెలకువగానే ఉన్నాడు మధుబాబు. అతడి మస్తిష్కం తీవ్రంగా పనిచేస్తోంది. తెల్లవారగానే తండ్రితో తన మనసులో మాట చెప్పేయాలి. అందుకు గంటలు, ఘడియలు లెక్క పెడుతున్నాడు. ఇక ఏ మాత్రం జాగు చేసినా తన జీవనగతే మారిపోతుంది. ఉదయం ఎనిమిది గంటలకు హనుమంతయ్యగారు సంబంధం ఖాయం చేసుకోవడానికి వస్తున్నారు. తనకీ పెళ్ళి ఇష్టం లేదు. ఎందుకని? పిల్ల కురూపా? కాదు. తను ఎవరినైనా ప్రేమించాడా? అలాంటి దేదీలేదు. అమ్మాయి చదువుకోలేదా? ఉహుఁ.....కట్నం వగైరా లేవైనా....? కోరినవన్నీ ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నాడామె తండ్రి. మరి సంబంధం వదులుకోవడం దేనికి? అదే చిత్రమైన ప్రశ్న. ఒకోమారు అన్ని విధాలా బాగా ఆలోచించి నిర్ణయం తీసుకున్నా, దానిమీద సమాజ ప్రభావం బలంగా పనిచేస్తుంది. అదే జరిగిందిక్కడ.

పెళ్లి చూపుల్లో మధుబాబు మనసును ఆకట్టుకుంది శైలజ. ఈడూ జోడూ బావుందన్నారంతా. చదువులో తనకంటే ఒక మెట్టు పైనే ఉంది. ఆమెతో జీవితం పూలబాటలో ప్రయాణం అనుకున్నాడు. వెంటనే పెళ్లికి ఊఁ కొట్టాడు. తన ఎన్నిక తిరుగులేనిదని, తన కింతకంటే మంచి సంబంధం దొరకడం దుర్లభమని తెలుసు.

"నీకు కాబోయే లైఫ్ పార్టనర్ బావుంటుందా?"

"పుత్తడి బొమ్మ."

"ఎడ్యుకేటెడేనా?"

"ఫస్ట్ క్లాస్ పోస్టుగ్రాడ్యుయేట్."

"జాబ్?"

పెదివి విరిచాడు మధుబాబు.

"వ్వాట్...? జాబు లేని అమ్మాయిని చేసుకుంటున్నావా?" ఏదో మహాపరాధం చేస్తున్నట్లుగా అన్నారు మిత్ర బృందం.

"భార్యా భర్తలిరువురూ ఉద్యోగాలు చేస్తున్నా జీవితం గగనంగా గడుస్తున్న ఈ రోజుల్లో నీ గుమాస్తాగిరితో ఓ ఆడదాన్ని ఉద్ధరించాలనుకుంటున్నా వన్నమాట."

"చదువుకున్న అమ్మాయి ఉద్యోగం దొరకకపోతుందా అని."

"ఎంత అమాయకుడివి మధూ! చదువుకున్న వాళ్ళందరికీ ఉద్యోగాలు దొరుకుతాయని ఎవరైనా గ్యారంటీ ఇవ్వగలరా? అలాగైతే మన దేశంలో నిరుద్యోగం ఎందు కింత విలయతాండవం చేస్తుంది?"

"లాట్రీ టిక్కెట్టు కొని లక్ష రూపాయల కోసం ఎదురుచూసే వాడికంటే పదిహేను రూపాయలు సంపాదించడానికి ప్రయత్నం చేసే వాడు ఘనుడంటాను. నువ్వు కొంతకాలం వెయిట్ చేసుంటే ఎంప్లాయిడ్ గర్ల్ దొరికేది. యూ పూర్ ఫెలో! బజారులో రెడీమేడ్ వస్తువులు దొరుకుతున్నప్పుడు రా మెటీరియల్ కోసం ప్రాకులాడటం అవివేకం."

స్నేహితులు తలొకరూ తలో రకంగా అన్నారు. వారి మాటలు మధుబాబుమీద బాగా పని చేశాయి. అందుకే ఆ సంబంధం వదులుకోవాలని నిర్ణయించుకున్నాడు.

ఆలోచిస్తుండగా భళ్ళున తెల్లవారింది.

"నేనీ సంబంధం చేసుకోను నాన్నా!" దేవతార్చన ముగించుకుని దేవుడి గదిలోంచి బయట కొస్తున్న తండ్రితో కుండ బద్దలుకొట్టినట్లు చెప్పాడు మధుబాబు.

"ఏవిట్రా ఆ మాటలు. ఉన్నట్లుండి..."

"లేదు. నేను శైలజను చేసుకోలేను."

"మరో గంటలో తాంబూలాలు పుచ్చుకోవడానికి హనుమంతయ్య గారొస్తున్నారు. ఇప్పుడివేం మాటలురా?"

"క్షమించునాన్నా! నేను సుఖపడాలనుకుంటే..."

"పెద్ద వాళ్ళతో వ్యవహారం బాగుండదురా! ఆ పిల్ల నీకిష్టం లేకపోతే ఆ విషయం ముందే చెప్పి ఉండవలసింది. నువ్వు కావాలన్నావు గనకనే వ్యవహారం ఇంతవరకు తీసుకొచ్చాం. ఉన్నపళంగా కాదంటే ఏం బావుంటుంది చెప్పు. రేపు ఆ పిల్లకి...." నచ్చజెప్పబోయాడు శివరామయ్య.

"నువ్వు వంద చెప్పు.....లక్ష చెప్పు. నాకీ సంబంధం ఇష్టం లేదు. వాళ్ళతో

నువ్వేం చెప్పుకుంటావో నా కనవసరం. మరీ బలవంతం పెడితే నేనేమై పోతానో చెప్పలేను." బెదిరిస్తూ అక్కడినుండి వెళ్లిపోయాడు మధుబాబు.

కొడుకు ధోరణికి శిలాప్రతిమయ్యాడు శివరామయ్య.

నోట మాట రాలేదు అనూరాధమ్మకు.

అత్యంత ఆర్భాటంగా జరగవలసిన ప్రధానకార్యక్రమం నిర్వీర్యమై పోయింది.

అవమాన భారంతో క్రుంగిపోయాడు హనుమంతయ్య.

మాట నిలకడలేని మనిషితో, మనువు తప్పిపోయినందుకు సంతోషించింది శైలజ మాత్రమే.

ఉద్యోగం చేస్తున్న పిల్లను చూపిస్తే అందంగా లేదని, రూపవతిని పట్టుకొస్తే ఉద్యోగం లేదని, ఇలా తీసుకొచ్చిన ప్రతి సంబంధాన్ని తిప్పికొట్టాడు మధుబాబు.

చూస్తూ ఉండగానే కళ్ళముందు అయిదు వసంతాలు కర్పూరంలా కరిగిపోయాయి.

మూడు పదులు మీద పడటంతో వివాహ వయసు మించిపోయే ప్రమాదం ఉందనుకుని, లక్ష్మితో తన జీవితాన్ని ముడి వేసుకున్నాడు మధుబాబు. ఆమె అప్సరస కాదు. అలా అని కురూపి అనలేం. ప్రభుత్వ బాలికల రెసిడెన్షియల్ స్కూల్లో అటెండరుగా పనిచేస్తోంది.

ఆలుమగల ఆనందమయ జీవితానికి 'అర్ధమే' పరమార్థం కాదనుకున్నాడు మధుబాబు. అతడా నిర్ణయానికి రావడానికి కారణం జీవితంలో తను చవిజూచిన చేదు అనుభవాలే. అవినీతి ఆరోపణలతో ఇరుక్కున మధుబాబును సస్పెండ్ చేశారు అధికారులు. పెళ్ళాం పట్టుకొచ్చిన పదకొండు వందలే ఇప్పుడు తన కుటుంబానికి ఆధారం. ఆమె ఉద్యోగం చేయడానికి స్కూలుకు వెళితే, ఇంట్లో వంట చేయడం, పిల్లను చూడటం తన వంతైంది. అర్ధాంగి అనుకూలవతి అవడంవలన జరుగుబాటు ఎలా ఉన్నా రవంత ప్రశాంతంగా ఉండగలుగుతున్నాడు మధుబాబు.

"ఇవాళ నువ్వు కాస్త పెందలాడే వస్తే నేను బయటకు వెళ్ళడానికి వీలవుతుంది. అడ్వకేటు ఆరు గంటలకు రమ్మనమని కబురు చేశాడు. ఈ కేసు నుండి ఎలా బయటపడతానో, ఏమిటో? పోయిన ఉద్యోగం దొరుకుందో, లేదో గాని ఉన్నదంతా కోర్టు ఖర్చులకే సరిపోతోంది." నిస్పృహ చెందుతూ భార్యను గుమ్మంవరకు సాగనంపాడు మధుబాబు.

"మీ రేమీ దిగులు పడకండి. న్యాయం మనపట్ల ఉంది. ఆలస్యమైనా మీకు

ఉద్యోగం దొరకడం ఖాయమని నా అంతరాత్మ భోధిస్తుంది" అన్నది లక్ష్మి పాపను మధుబాబు కందిస్తూ.

"మనిషి పరిస్థితులతో రాజీ పడటం తప్ప చేయగలిగిందేముంది?"

మధుబాబు మాటలలో వైరాగ్యం, నైరాశ్యం మిళితమై ఉన్నాయి. తను ఊహించుకున్న రంగుల స్వప్నం కళ్ళముందే కరిగిపోయింది. ఊహించుకున్న ఊహా సౌధాలు పేక మేడల్లా కూలిపోయాయి. రాబడి తగ్గింది. ఖర్చులు పెరిగాయి. బాధ్యతలు అతడి మనసును కృంగదీస్తున్నాయి. పని పాటలు లేనందున రకరకాల ఆలోచనలు అతడి మెదడును తొలిచేస్తున్నాయి.

భార్య వెళ్ళి పోగానే పాపను ఉయ్యాలలో వేసి ఊపుతూ తనూ నిద్రలోకి జారిపోయాడు మధుబాబు.

ఆ రోజు పేరెంట్స్ మీటింగు ఉందని, ఇంటికి రావడం ఆలస్యమౌతుందని చెప్పి స్కూలుకు వెళ్ళింది లక్ష్మి.

సాయంత్రం అయిదు అయిందగ్గరనుండి పాప గుక్క పెట్టి ఏడ్వడం మొదలుపెట్టింది. బిడ్డను ఓదార్చేందుకు విశ్వప్రయత్నం చేశాడు మధుబాబు.

ఆటబొమ్మలు పెట్టి ఆడించాడు.

పాలు తాగమని బతిమాలాడు.

ఎత్తుకుని అటూ ఇటూ తిప్పాడు.

తను చేసి ప్రయత్నాలన్నీ విఫలం కావడంతో, పాపను భుజాన ఎక్కించుకుని స్కూలుకు బయలుదేరాడు.

స్కూల్లో మీటింగు జరుగుతోంది.

ప్రిన్సిపాలు చెబుతున్న విషయాల్ని పేరెంట్సు శ్రద్ధగా వింటున్నారు.

వచ్చిన వాళ్ళందరికీ కాఫీలు సర్వు చేస్తోంది లక్ష్మి. ఆ దృశ్యం కంటబడేసరికి కలుక్కుమన్నది అతడి మనసు. తనుఏం చేయగలడు? అది ఆమె డ్యూటీ. పని మానిపించేస్తే తన కీమాత్రం కూడా ఆధారం ఉండదు.

అప్రయత్నంగా అతడి దృష్టి స్టేజిమీద నిలబడి మాట్లాడుతున్న ప్రిన్సిపాలు మీద పడింది. గతుక్కుమన్నది అతడి హృదయం. తన కళ్ళను తనే నమ్మలేకపోయాడు. ఆమె ఎవరో కాదు. శైలజ. తను పెళ్ళి చేసుకుంటానని చెప్పి, తాంబూలాల వరకు తీసుకొచ్చి, చివరి క్షణంలో వద్దు పొమ్మన్న శైలజ. అంతలోనే ఆమె ఎంత ఎదిగిపోయింది? ఇప్పుడు తనకు ఆమె ముందు నిలబడే అర్హత కూడా లేదు.

అవకాశాలన్నవి. అస్తమానూ రావు. వివేకులు వెంటనే ఉపయోగించుకుంటారు. మూర్ఖులు జారవిడుచుకుంటారు. తను రెండవ కోవకు చెందుతాడేమో!

మరి అక్కడ నిలవబుద్ధిగాక, వెనుదిరిగి వెళ్ళి పోతున్న మధుబాబు "ఏవండీ" అన్న లక్ష్మి పిలుపుతో ఆగిపోవలసి వచ్చింది.

సమావేశం పూర్తి కావడంతో వచ్చిన వాళ్లంతా లేచారు.

"పాప ఏడుస్తూ ఉంటే...." నీళ్ళు నమిలాడు మధుబాబు.

"దాన్ని ఇలా ఇవ్వండి" అంటూ పాప నెత్తుకుని, అప్పుడే అక్కడకు వచ్చిన ప్రిన్సిపాలుకు భర్తని పరిచయం చేసింది లక్ష్మి.

శైలజను చూడలేక సిగ్గుతో కుంచించుకుపోయాడు మధుబాబు.

ఆమె ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ భార్య అని, తను అతడి వద్దే పని చేస్తూ సస్పెండయ్యాడన్న నిజాన్ని తెలుసుకున్న మధుబాబుకి, గుండెమీద ఎవరో తుపాకీ పేల్చినట్లైంది.

● *ఆంధ్ర ప్రభ వీక్లీ, 18–7–90.* ●